ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్నూలు
జిల్లా వార్తలు
ఆదివారం 14 జనవరి 2024

సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు : కలెక్టర్, ఎస్పీ

కర్నూలు (కలెక్టరేట్), జనవరి 13: జిల్లా ప్రజలకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్‌లు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని వారు వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగే పోలీసు స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.



పసిడి పంటల పండుగ

- ప్రకృతి, ఆధ్యాత్మిక, ఆరోగ్య సందేశాలకు వేదిక
- నేడు భోగి, రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుమ
- వేడుకలకు సిద్ధమైన గ్రామ సీమలు

కర్నూలు (కల్చరల్), జనవరి 13:

సంక్రాంతి పెద్ద పండుగ. ముచ్చటగా మూడు రోజులపాటు వేడుకలు కొనసాగుతాయి. ఈ పండుగ ఎన్నో ఆధ్యాత్మిక సందేశాలకు నెలవు. మనిషికి మట్టికి ఉన్న మమకారానికి ప్రతీక ఈ పండుగ. సంక్రాంతి ప్రకృతిలో పెరిగే జీవరాసులతో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తుంది. మరోవైపు సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తుంది. ఇల్లు, వాకిళ్లు నిత్యం ఎలా శోభాయమానంగా సిద్ధం చేసుకోవాలో సూచిస్తుంది. సమాజంలో తోటివారిని ఎలా ఆదుకోవాలో తెలియజేస్తుంది. రైతుల ఇల్లు సిరిసంపదలకు నెలవై, భోగభాగ్యాలకు వేదికగా మారుతుంది. సంక్రాంతి అంటే సూర్యుడు ధనురరాశి నుంచి మకర రాశిలోకి ప్రయాణించడమే మకర సంక్రాంతి. అదే ఏటా పల్లె సీమల్లో వెలుగులీనే నవజీవన క్రాంతి. పసిడి సంపదలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి వేడుకలను నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. పల్లెలతోపాటు పట్నాల్లో కూడా సంక్రాంతి వైభవంగా జరుపుకోనున్నారు. ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలు నిర్వహించుకోకున్నారు.



సృజనాత్మక భావాలకు ప్రతీకలు రంగవల్లులు

సంక్రాంతి ముందు ధనుర్మాసం వస్తుంది. ఈ ధనుర్మాసం ఆరంభం నుంచి పల్లెల్లో ప్రతి ఇంటి ముందు కాంతులీనే రంగవల్లులు కనువిందు చేస్తుంటాయి. ముత్యాల ముగ్గులు వేసి వాటి మధ్యలో గోమయంతో చేసిన గొబ్బెమ్మలు పెట్టి, వాటిపై బంతి, చేమంతి పూలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. ముగ్గులు సంక్రాంతి పండుగ ప్రత్యేకత. ముగ్గులు మహిళల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతకు అద్దం పడతాయి. ఈ ముగ్గులను తీర్చిదిద్దడంలో మహిళలు పోటీ పోటీపడతారు. సంక్రాంతి నెలలో కనిపించే ముగ్గులు చుక్కలుగా పెట్టి, వాటిని కలుపుతూ అందంగా తీర్చిదిద్దడంలో మహిళల నైపుణ్యం స్పష్టంగా ప్రస్ఫుటమవుతుంది.



నవ్య క్రాంతిని స్వాగతించే 'భోగి' వేడుక..

సంక్రాంతి వేడుకల్లో ముందుగా వేతెంచే భోగి పండుగకు ఎంతో విశిష్టత ఉంది. భోగి పండుగ రోజున ఉదయం వేకువ జామునే భోగి మంటలు వేస్తారు. సామూహికంగా భోగి మంటలు వేసి, అందులో పాత వస్తువులు కాల్చి వేస్తారు. గత స్మృతులకు సెలవు పలికి, నవ్యతతో కూడిన జీవితాన్ని ఈ వేడుక నుంచి ప్రారంభించాలని, భోగి మంటల ద్వారా నవ్యక్రాంతిని అందుకోవాలనే అర్థం ఇందులో ఇమిడి ఉంది. భోగి పండుగ రోజున పిల్లలకు రేగు పండ్లు, పూలతో తలమీద పోస్తారు. ఇందువల్ల ప్రకృతి నుంచి సంభవించే ఎలాంటి కీడు తమ పిల్లలపై పడకూడదని తల్లిదండ్రులు భోగి మంటల వద్ద దైవాన్ని ప్రార్థిస్తారు. భోగి పండుగ రోజున నువ్వులు కలిపిన సొద్ద రొట్టెలు, చిక్కుడు, వంకాయ కూరను ఆహారంగా స్వీకరిస్తారు.

సంక్రాంతి లక్ష్మికి స్వాగతం..

నెల రోజులపాటు కొనసాగిన ధనుర్మాసం ముగింపును గుర్తు చేస్తూ ప్రకృతిలోని సూర్యుడు దక్షిణార్థ గోళం నుంచి ఉత్తరార్థ గోళం వైపు పయనిస్తూ మకర రాశిలో ప్రవేశించడాన్నే మకర సంక్రాంతిగా వేడుక నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండుగ ప్రధానంగా రైతుల పండుగ. అందుకే పల్లెల్లో, నగరాల్లో కానరాని సందడి పల్లెల్లో ప్రతి ఇంటా కానవస్తుంది. పండుగ రోజున రైతుల ఇండ్లన్నీ బంధువులు, కుటుంబ సభ్యులతో కళకళలాడుతుంటాయి. సంక్రాంతి పండుగ రోజున కొత్త ధాన్యంతో పొంగలి చేస్తారు. అలాగే వివిధ రకాల పిండి వంటలు ప్రత్యేకంగా తయారు చేస్తారు. సంప్రదాయ రుచులను ఆస్వాదిస్తారు. కొత్త దుస్తులు ధరించి ఆనందంగా కుటుంబ సభ్యులతో గడుపుతారు. తమ ఇండ్ల ముందు ధాన్యం కోసం యాచించే హరిదాసులు, జంగమ దేవరలు, గంగిరెద్దుల ఆటగాళ్లకు తమ వంతుగా ధాన్యం, పాత దుస్తులు వంటివి దానం చేస్తారు. సాయం వేళల్లో గ్రామ సీమల్లోని పంట పొలాల్లో కుర్రకారు గాలి పటాల ఎగురవేతపై ఆసక్తి చూపిస్తారు. చిన్నారి బాలికల కోసం తల్లిదండ్రులు బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తారు.

పశు సంపదకు ప్రతీక.. కనుమ పండుగ..

రైతులు తమ వ్యవసాయ పనులకు ఏడాదంతా ఆసరాగా నిలిచి ఉండే పశువుల కోసం కనుమ పండుగ ఘనంగా నిర్వహిస్తారు. ఎద్దులు, ఆవులకు స్నానం చేయించి, వాటిని అందంగా ముస్తాబు చేస్తారు. పశు సంపదను మరింత అభివృద్ధి చేయాలని, తమ వ్యవసాయ పనులకు మరింత అండగా నిలవాలని వాటిని పూజిస్తారు.

పొలిటికల్ పందెం కోళ్లు!





- సంక్రాంతి తరువాత ఎన్నికల సంగ్రామం
- పోరుకు సిద్ధమవుతున్న రాజకీయ పక్షాలు
- ఇప్పటికే ముగ్గురు అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ
- గెలుపు గుర్రాల ఎంపికలో టీడీపీ కసరత్తు
- సంక్రాంతి రోజు టీడీపీ తొలి జాబితా విడుదల?

కర్నూలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల బరిలో తలపడేందుకు కర్నూలు జిల్లా పొలిటికల్ పందెం కోళ్లు రెడీ అవుతున్నాయి. కోళ్ల పందాలను తలపించేలా ఈసారి ఎన్నికలు రాబోతున్నాయి. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు సైతం అభ్యర్థుల ఎంపికలో తలమునకలయ్యాయి. ఇప్పటికే అధికార వైసీపీకి చెందిన ముగ్గురు అభ్యర్థులను సీఎం జగన్ ప్రకటించారు. మరో 11 మంది అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమయ్యారు. పోరు సమీపిస్తుండటంతో బరిలో తలపడే రాజకీయ పందెం కోడి ఏదీ..? అని ప్రధాన ప్రతిపక్షం టీడీపీలో టెన్షన్ కొనసాగుతోంది. గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు పందెం కోళ్ల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. పండుగ రోజు టీడీపీ తొలి జాబితా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మార్చిలో జరిగే మహా సంగ్రామం బరిలో తలపడే రాజకీయ పందెం కోళ్లు ఏవీ..? ఉమ్మడి జిల్లాలో ఏ ఇద్దరు కలసినా ఇదే చర్చ.

బరిలో దిగేది ఎవరు..?

నంద్యాల లోక్‌సభ, 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తలపడే పందెం కోళ్లను వైసీపీ ఎంపిక చేయాల్సి ఉంది. డోన్ నుంచి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ఆ పార్టీలో ఆశావహులు సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో అభ్యర్థుల ఎంపిక జగన్‌కు తలనొప్పిగా మారింది. ఇప్పటికే ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు అభ్యర్థులను ప్రకటించినా ఎమ్మిగనూరు, కోడుమూరు అభ్యర్థుల ఎంపికపై వైసీపీ నాయకుల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. కోడుమూరులో జగన్ ఫ్లెక్సీలు దహనం చేశారు. ఆలూరులో విరూపాక్షి ఎంపికపై మంత్రి గుమ్మనూరు జయరాం, ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. కర్నూలు నుంచి ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు, కాంగ్రెస్ నుంచి పార్టీలో చేరిన మహ్మద్ అలీఖాన్, పాడా పీఆర్ఓ బషీర్, పత్తికొండ నుంచి ఎమ్మెల్యే శ్రీదేవి, పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నా.. బరిలో నిలిచేది ఎవరు..? అనే చర్చ ఉంది. పాణ్యం నుంచి నాకే టికెట్ అని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ధీమాగా చెబుతున్నా.. ఇక్కడి నుంచి బరిలో దిగేందుకు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సీఎంఓ కేంద్రంగా పావులు కదుపుతున్నారు. ఆదోని నుంచి తనకే టికెట్ అని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అంటున్నా ఈ ఐదేళ్లలో ఆయనపై ఉన్న ప్రజావ్యతిరేకత దృష్ట్యా మార్చాలని వైసీపీ అధిష్టానం చూస్తోంది. మంత్రాలయం నుంచి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికే టికెట్ వచ్చే అవకాశం ఉన్నా ఆయన అన్న కుమారుడు మంచాల సహకార సంఘం అధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నారు.

టీడీపీ ఆశావహుల్లో టెన్షన్

రాబోయే సంగ్రామంలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులు బరిలో దిగబోతున్నారు. సీట్ల సర్దుబాటు దృష్ట్యా పందెం కోళ్ల ఎంపికపై ఆచితూచి అడుగులు వేస్తున్నారు. కర్నూలు నుంచి టీజీ భరత్, ఎమ్మిగనూరు నుంచి మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిలకు పార్టీ అధినేత చంద్రబాబు ఇప్పటికే స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. ఇక మంత్రాలయం నుంచి తలపడేందుకు ఇన్‌చార్జి పి.తిక్కారెడ్డి సర్వం సిద్ధం చేసుకున్నా టికెట్ కోసం ఆ పార్టీ నాయకుడు ఉలిగయ్య, ఇటీవలే పార్టీలో చేరిన మాధవరం రాఘవేంద్రరెడ్డి కూడా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదోని నుంచి పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షి నాయుడుకే టికెట్ ఖరారైందని ఆయన వర్గీయులు చెబుతున్నారు. అయితే తాము రేసులో ఉంటామని గుడిసె కృష్ణమ్మ, భాస్కరరెడ్డి అంటున్నారు. ఆలూరు నుంచి పోటీ చేస్తానంటున్నారు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ. ఇక్కడి నుంచి బరిలో దిగేందుకు నియోజకవర్గం పార్టీ మాజీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం జ్యోతి ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నారు. పత్తికొండ బరిలో ప్రత్యర్థి వైసీపీపై తలపడేందుకు బాబాయి-అబ్బాయి మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు టికెట్ ఆశిస్తున్నారు. కోడుమూరు నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకెపోగు ప్రభాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నేషపోగు కిరణ్మయి, దస్తగిరి, బి.తాండ్రపాడు సర్పంచ్ జయన్న తదితరులు ఎవరికివారుగా ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో బలాబలాలు, రాజకీయ, సామాజిక సమీకరణాలు వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని ఎన్నికల బరిలో తలపడే పందెం కోళ్ల ఎంపికలో టీడీపీ అధిష్టానం కసరత్తు చేస్తుంది. జిల్లాలో జనసేన కూడా సీటు ఆశిస్తే ఎక్కడ అవకాశం ఇవ్వాలో కూడా అధిష్టానం పరిశీలిస్తుంది. దీంతో బరిలో తలపడే పందెం కోళ్లు ఏవీ..? అనే చర్చ జోరుగా సాగుంది.

2019 . ఏప్రిల్ 11న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల పోలింగ్ జరిింది. అదే నెల 30న సీఎం జగన్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్ల కావస్తోంది. మరో రెండు మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు జారీ చేసే అవకాశం ఉంది. సీఈసీ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. వైసీపీ అధినేత, సీఎం జగన్ ఒక అడుగు ముందుకు వేసి కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా మంత్రి గుమ్మనూరు జయరాం, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బూసినే విరూపాక్షి, ఎమ్మిగనూరు అభ్యర్థిగా మాచాని వెంకటేశ్, కోడుమూరు అభ్యర్థిగా డాక్టర్ ఆదిమూలపు సతీష్‌లను ప్రకటించారు.

'జగన్‌రెడ్డికి యావజ్జీవం తప్పదు'



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జనవరి 13: సీఎం జగన్మోహన్‌రెడ్డికి యావజ్జీవ శిక్ష తప్పదని జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ రెడ్డిపై తీవ్ర నేరారోపణలతో 38 కేసులు నమోదయ్యాయని, రూ. 43 వేల కోట్ల దోపిడీపై సీబీఐ, ఈడీ జార్జ్ షీటు కూడా వేశాయని తెలిపారు. ఈ కేసుల నుంచి జగన్ తప్పించుకునే అవకాశం లేదని, యావజ్జీవ శిక్ష తప్పదని అన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన కేసుల్లో ఇప్పటికి 12 సంవత్సరాల కాలంగా 3,500 పర్యాయాలు తప్పించుకున్నారని, ఇది దేశంలోనే చరిత్రగా నిలిచిందని, నేరం చేయపోతే కోర్టుకు హాజరై తీర్పు పొందేవారని, నేరాలు చేసినందువల్లే ఇలా తప్పించుకు తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. జగన్ ఒత్తిడితో చంద్రబాబుపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారని అన్నారు. చంద్రబాబు వ్యక్తిగతంగా ఆర్థిక ప్రయోజనం పొందినట్లు సీఐడీ ఎలాంటి ఆధారాలు కోర్టుకు చూపించలేకపోయిందని తెలిపారు. ఇలాంటి సంఘటనలు ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

జిల్లా ప్రజలకు తెలుగు దేశం పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు తెలిపారు. శనివారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో సంక్రాంతి సందర్భంగా నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శులు పీజీ నరసింహులు యాదవ్ నంద్యాల నాగేంద్ర, కే తిరుపాల్ బాబు, బుర్రా ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవన్నీ ఓటు బ్యాంకు రాజకీయాలు

వైసీపీపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 13: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం చేస్తున్నవన్నీ ఓటు బ్యాంకు రాజకీయాలేనని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. శనివారం నగరంలో జరిగిన ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా సీఆర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో ఉన్న వాటిలో కేంద్రం ఒక్కటి కూడా అమలు చేయలేదని, బీజేపీతో కలిసి ఉండటం వల్ల జగన్ కూడా ఏమీ చేయలేదని అన్నారు. బీజేపీతో కలవకపోతే టీడీపీతో తాము కలిసి నడుస్తామని అన్నారు. అయోధ్య రామమందిరం నిర్మాణంలో బాబ్రీ మసీదు కూల్చివేతలో ఎల్‌కే అద్వాని ప్రధాన పాత్ర పోషించారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఓటు బ్యాంకు కోసం బీజేపీ నాయకులు శ్రీరాముని అక్షింతలు ఇంటింటికి పంపుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీతో కౌగిలించుకోవడం వల్లనే కేసీఆర్ ఓటమి పాలయ్యారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి డి.గిడ్డయ్య, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

నారా లోకేశ్‌ను కలిసిన సోమిశెట్టి



నారా లోకేశ్‌తో సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు(అర్బన్), జనవరి 13: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఉదయం విజయవాడలోని తన గృహంలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని, పార్టీ విజయం కోసం అందరు కలిసి కట్టుగా పని చేయాలని లోకేష్ సూచించారని తెలిపారు. కార్యక్రమంలో సోమిశెట్టి నవీన్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కె.చంద్రకాంత్ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి ఆర్థిక ఉగ్రవాది: మల్లెల

కల్లూరు, జనవరి 13: జగన్‌రెడ్డి ఆర్థిక ఉగ్రవాది అని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ విమర్శించారు. శనివారం నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ జేబుసంస్థ సీఐడీని అడ్డం పెట్టుకుని చంద్రబాబు నాయుడిపై కక్ష పూరితంగా కేసులు పెట్టడంతో పాటు నీలి మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్‌రెడ్డిపై ఇప్పటికే 38 కేసులు ఉన్నాయని, 43వేల కోట్ల రూపాయల దోపిడీపై సీబీఐ, ఈడీ చార్జిషీట్లు కూడా వేశాయని, ఈకేసుల్లో 3500 సార్లు వాయిదా తీసుకున్న ఏకైక ఆర్థిక నేరస్తుడు జగన్ అని విమర్శించారు. 2004లో అప్పులతో ఇల్లు అమ్ముకునే స్థితిలో ఉన్న జగన్ 19 ఏళ్లలో రూ.4 లక్షల కోట్ల ప్రజాసంపదను కొల్లగొట్టారని ఆరోపించారు. జగన్ పాలనలో చంద్రబాబుపై మూడు అక్రమ కేసులు పెట్టి ఏ కేసుకు ఆధారాలు చూపలేదన్నారు. జగన్ రెడ్డి కేసులపై సాక్షాత్తు గౌరవ జడ్జిలే కీలక వ్యాఖ్యలు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని, ఎన్ని ఇబ్బందులకు గురి చేసి అక్రమ కేసులు పెట్టినా తెలుగుదేశం పార్టీ భయపడదన్నారు.

సెక్రటరీలకు పదోన్నతులు

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 13: మార్కెట్ కమిటీల్లో పని చేస్తున్న సెక్రటరీలకు పదోన్నతులు కల్పించే ప్రక్రియను మార్కెటింగ్ శాఖ కమిషనర్ చేపట్టారు. శనివారం కర్నూలు జిల్లాలోని కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు మార్కెట్ కమిటీలకు మూడవ గ్రేడ్ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పించిన అధికారులకు పోస్టింగులను కమిషనర్ జారీ చేశారు. సహాయ సెక్రటరీలుగా పని చేస్తున్న సుందర్‌రాజును కోడుమూరు మార్కెట్ కమిటి సెక్రటరీగా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. అదేవిధంగా ఆలూరు మార్కెట్ కమిటీకి సుకన్య, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీకి పద్మావతిని నియమించారు. వీరు బుధవారం బాధ్యతలు తీసుకోవాలని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు కర్నూలు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. నంద్యాల జిల్లాలో ఎవరికీ పదోన్నతులు లభించలేదు. మరికొద్ది రోజుల్లో సూపర్‌వైజర్లుగా పని చేస్తున్న కొంత మందికి పదోన్నతులు లభించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులో పని చేస్తున్న కేశవరెడ్డి, శివన్న, నాగేష్‌లకు అదనపు సెక్రటరీలుగా పదోన్నతి లభించే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు.

సొంత పార్టీ కార్యకర్తపైనే వైసీపీ నాయకుల దాడి

సి.బెళగల్, జనవరి 13: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో వైసీపీ కార్యకర్తపై వైసీపీ నాయకులు దాడి చేశారు. గ్రామంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని టీడీపీ కార్యకర్తలు నిర్మించుకున్న ఇండ్లను రెండు రోజుల క్రితం కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు కూలగొట్టారు. ఇందులో కురువ కులస్థుల దైవమైన బీరప్ప గుడిని కూడా కూలగొట్టారు. అయితే అదే సామాజిక వర్గానికి చెందిన పవన్ అనే తమ పార్టీ కార్యకర్తపై ఆగ్రహంతో వైసీపీకి చెందిన జగన్‌మోహన్ రెడ్డి, రంజితరెడ్డి, సుధాకర్ దాడి చేశారు. బీరప్ప గుడి దగ్గర వాళ్ల పొలాలు ఉండటంతో వాళ్ల ఆగ్రహించి తమ పార్టీ కార్యకర్తే అయినప్పటికీ పవన్ మీద దాడి చేసినట్లు తెలుస్తోంది. పవన్ కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చారు. దీంతో దాడి చేసిన వారు వెళ్లిపోయారు. పవన్‌ను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైసీపీ కార్యకర్తపై దాడి జరిగిన విషయం స్థానిక ఎస్ఐని అడుగగా తమ దృష్టికి రాలేదని తెలిపారు.

కొత్తగా ఐదు ఎన్ఎంసీ బయోమెట్రిక్ యంత్రాలు



కర్నూలు(హాస్పిటల్), జనవరి 13: కర్నూలు మెడికల్ కాలేజీకి కొత్తగా ఐదు ఎన్ఎంసీ బయోమెట్రిక్ యంత్రాలు వచ్చాయి. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ శనివారం కేఎంసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, రీజినల్ కంటి ఆసుపత్రి, సూపరింటెండెంట్ ఆఫీసులో కొత్త మిషన్లను ఏర్పాటు చేశారు. కర్నూలు మెడికల్ కాలేజీలో 391 మంది వైద్యులు పని చేస్తున్నారు. వీరందరికీ కేవలం ఆరు బయోమెట్రిక్ మిషన్లతో ఎన్ఎంసీ హాజరు వేయడం ఇబ్బందులు తలెత్తాయి. జనవరి 1 నుంచి ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఎన్ఎంసీ బయోమెట్రిక్ హాజరు విధానం (ఏఈబీఏఎస్) అమల్లో కి తెచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వైద్యుల కోసం కొత్తగా ఐదు ఫేషియల్ ఫింగర్ బయోమెట్రిక్ యంత్రాలను కొనుగోలు చేశారు. కొత్త బయోమెట్రిక్ యంత్రాలతో పాటు 100 ఎంబీపీఎస్ నెట్‌స్పీడ్‌ను కూడా ఏర్పాటు చేశామని, రెండు రోజుల్లో బయోమెట్రిక్ సమస్యలు తీరుతుందని ప్రిన్సిపాల్ తెలిపార. నెట్ స్పీడ్ వల్ల తక్కువ సమయంలో ఎక్కువ మంది వైద్యులు హాజరు వేసే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

జల్ల బాబు మృతి పద్యనాటక రంగానికి తీరని లోటు



మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

కర్నూలు(కల్చరల్), జనవరి 13: కర్నూలుకు చెందిన పౌరాణిక నటుడు జల్ల బాబు మృతి పద్య నాటక రంగానికి తీరనిలోటని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. శనివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో జల్లబాబు సంస్మరణ సభ, సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఏకాంకిక నాటక ప్రదర్శన నిర్వహించారు. నగరానికి చెందిన కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత జల్లబాబు చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ జల్లబాబు కుటుంబానికి టీజీవీ కళాక్షేత్రం పక్షాన రూ.5వేలు విరాళం ప్రకటించారు. జల్లబాబు శ్రీకృష్ణుడు, అర్జునుడు, భవానీ తదితర పాత్రల్లో ప్రేక్షకులను మెప్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళావాహిని అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు ఆధ్వర్యంలో శ్రీకృష్ణరాయబారం, భక్త చింతామణి, అల్లూరి సీతారామరాజు తదితర నాటకాల్లోని వివిధ ఘట్టాలను ప్రదర్శించారు.

మైనార్టీ హక్కుల కోసం పోరాటం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 13: రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ హక్కుల కోసం పోరాటాలు చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా అన్నారు. శనివారం నగరంలోని కార్యాలయంలో సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధిపై పాలక వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ సమావేశంలో విశ్రాంత తహసీల్దారు రోషన్ అలీ, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు డైమండ్ సలాం పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు



కర్నూలు: దీక్షల్లో కూర్చున్న అంగన్‌వాడీలు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 13: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లోని ధర్నా చౌకు వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు శనివారానికి 33వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, అంగన్‌వాడీల జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు మాట్లాడుతూ శుక్రవారం జరిగిన చర్చలు అంగన్‌వాడీలను అవమానకరంగా చేసే విధంగా చర్చలు జరిగాయని తెలిపారు. ఐసీడీఎస్‌కు సంబంధించిన మంత్రిగానీ, మంత్రులు గానీ పాల్గొనకుండా సలహాదారులతో చర్చలు జరపడంపై ఏంటనీ వారు ప్రశ్నించారు. దీక్షలకు ప్రజానాట్యమండలి కళాకారులు ఇరాజు, సుంకన్న, సుబ్బరాయుడు, చిట్టి, లోకేశ్, రాంబాబు బృందం ఆటపాటల ద్వారా సమ్మెకు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో కర్నూలు అర్బన్ 4 సెక్టారు నుంచి అంగన్‌వాడీలు టీఎస్ విజయలక్ష్మి, ఎం.సుమలత, స్రవంతి, నాగమణి, లక్ష్మీదేవి, కనకమ్మ, స్వర్ణకుమారి, హైమావతి, రేణుక, వెంకటలక్ష్మి, ఈదమ్మ, సావిత్రి, సుజాత బాయి, మునిరాబీ, నాగమణి, శివకుమారి, వహీదా, అరుణ, నాగేషమ్మ, మంజుల కూర్చున్నారు.

కోడుమూరు(రూరల్): అంగన్‌వాడీల సమ్మెకు టీడీపీ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. శనివారం పట్టణంలోని అంగన్‌వాడీల సమ్మెకు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు బొగ్గుల దస్తగిరి, జక్కపోగు సురేష్, పట్టె క్రిష్ణ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసీపీ మోసకారి మాటలను అంగన్‌వాడీలు సైతం నమ్మారని, ఇపుడు జగన్ నైజం ఏంటో అందరూ గుర్తించారని అన్నారు. అంగన్‌వాడీలపై పనిభారం పెట్టి వెట్టిచాకిరి చేయిస్తున్న ప్రభుత్వం జీతాలను ఎందుకు పెంచడం లేదని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు పులకుర్తి, మెరుగుదొడ్డి, కల్లపరి గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టె క్రిష్ణ, త్రివేద్, వీరస్వామి, భాస్కర్, ఉరుకుందు, ఈరన్న, రాముడు, గడ్డమయ్య, చెన్నరాయుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.



కోడుమూరులో అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నాయకులు

ఆర్ఎంవోకు ఎంఎన్‌వోల పర్యవేక్షణ బాధ్యతలు

- త్వరలో 40 స్ట్రెచర్లు, 40 వీల్‌చైర్లు కొనుగోలు చేస్తాం
- సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జనవరి 13: ఇక నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోల పర్యవేక్షణ బాధ్యతలను ఆర్ఎంవో వెంకట రమణకు అప్పగిస్తున్నట్లు సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. ఆసుపత్రిలోని ధన్వంతరీ హాలులో ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలతో ఆయన సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ త్వరలో సర్వెంట్ పోస్టును జీవో ప్రకారం సీనియారిటీ మేరకు భర్తీ చేస్తామన్నారు. సీనియర్ ఎఫ్ఎన్‌వో సుశీల మాట్లాడుతూ నాలుగు వార్డులు కలిపి ఓ స్ట్రెచర్ ఉందని, దీని వల్ల రోగులకు ఇబ్బందిగా ఉందని సూపరింటెండెంట్ దృష్టికి తెచ్చింది. దీనిపై స్పందించిన ఆయన 40 స్ట్రెచర్లు, 40 వీల్ చైర్లు త్వరలో తెప్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి వార్డు యూనిట్‌కు ఒక్కొక్కటి చొప్పున వీల్‌చైర్, స్ట్రెచర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బాలు నాయక్, కార్యదర్శి ఖాజా మొద్దీన్ మాట్లాడుతూ 1500 పడకలకు ఎంఎన్‌వో, ఎఫ్ఎన్ వోల సంఖ్య సరిపోవడం లేదని, ఓటీ అసిస్టెంట్ల సంఖ్యను ఎంఎన్‌వోలను పెంచాలని కోరారు. ప్రతి మూడు నెలలకు డ్యూటీ రోస్టర్ వేయాలని సూపరింటెండెంట్‌ను కోరారు. దీనిపై సూపరింటెండెంట్ మాట్లాడుతూ అన్ని సమస్యలు పరిష్కరిస్తానని, ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోల సంఖ్యను పెంచుతామన్నారు. ఆసుపత్రిలో ఎవరైనా రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం క్యాజువాల్టీలో ఓ నర్సింగ్ స్టాఫ్‌పై దురుసుగా ప్రవర్తించిన ఓ ఎంఎన్‌వోకు సూపరింటెండెంట్ మెమో జారీ చేశారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 13: నగరంలోని అరోరానగర్‌కు చెందిన పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. శనివారం మౌర్యఇన్‌లోని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీని గెలిపిస్తే ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాల్సిందేనన్నారు. కార్యక్రమంలో వీరయ్య, ఓబులేసు, రాము, పూరి, పవన్, ప్రదీప్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

జగన్‌కు బుద్ధి చెప్పాలి: ఆకెపోగు



మాట్లాడుతున్న ఆకెపోగు ప్రభాకర్

సి.బెళగల్, జనవరి 13: వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో టీడీపీ మండల కన్వీనర్ గోవింద గౌడు ఆధ్వర్యంలో జయహో బీసీ గర్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకెపోగు ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలను మోసం చేశారన్నారు. టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సత్రం రామకృష్ణ, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు చిన్న మునెప్ప, ఎంపీటీసీ రవికుమార్, సోమన్న, వానలయ్య, బుడ్డన్న పాల్గొన్నారు.

నగరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కర్నూలు(న్యూసిటీ), జనవరి 13: నగరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం నిర్వహించారు. యాత్ర జరుగుతున్న తీరును పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్ పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పోషణ్ అభియాన్ లబ్ధిదారుల శ్రీమంతంలో భాగంగా మహిళలకు సారెను అందించారు. నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ. రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

రేపు వాతావరణ పరిశీలన కేంద్రాన్ని సందర్శించవచ్చు

కర్నూలు(కల్చరల్), జనవరి13: ఈనెల 15న నగరంలో బిర్లా కూడలిలో గల వాతావరణ పరిశీలన కేంద్రాన్ని విద్యార్థులు, నగర ప్రజలు సందర్శించవచ్చని వాతావరణ కేంద్ర అధికారి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ విభాగం 150వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

ఖానా-ఖజానాలో సంక్రాంతి సంబరాలు

కర్నూలు(కల్చరల్), జనవరి 13: నగరంలో బిర్లా గేటు ఖానా-ఖజానా (ఈట్ స్ట్రీట్)లో ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటూ సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు భోగి మంటలు, ఉదయం 8 గంటలకు అల్పాహారం, ఉదయం 9 గంటల నుంచి 'ఉట్టికొట్టు...గిఫ్ట్ పట్టు' కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు డ్యాన్స్ షో, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ హాజరవుతారని తెలిపారు. ఆసక్తిగల వారు పోటీల్లో పాల్గొనేందుకు తమ పేర్లు సెల్ నెం. 8341616759లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

తైక్వాండో పోటీల్లో రాణించాలి

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 13: క్రీడాకారులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో రాణించాలని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శనివారం స్థానిక మౌర్య ఇన్‌లో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఎంపికైన శ్రీలలితకు మెమెంటో అందజేసి అభినందించారు. శిక్షకుడు టి.వెంకటేశ్వర్లు, శ్రీలలిత తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు

మార్కెట్ యార్డులో మోసం

- రైతు ఫిర్యాదుతో బట్టబయలు
- అక్రమంగా వసూలు చేసిన డబ్బు వాపసు

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 13: కర్నూలు మార్కెట్ యార్డుకు కందులు తీసుకొచ్చిన రైతు నుంచి ఒక బస్తా మీద రూ.12.81పైసలు వసూలు చేయాల్సి ఉండగా.. కమిషన్ ఏజెంటు అదనంగా రూ.మరో రూ.10 కలిపి వసూలు చేశాడు. ఈ విషయాన్ని పసిగట్టిన ఆ రైతు అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందుతో పాటు అదనపు సెక్రటరీలో రెహిమాన్, వెంకటేశ్వర్లు వెంటనే ఆ కమిషన్ ఏజెంటును పిలిపించి మందలించాడు. రైతు నుంచి అదనంగా వసూలు చేసిన రూ.800 వెనక్కి ఇప్పించారు. మరోసారి ఇటువంటి ఫిర్యాదులు వస్తే లైసెన్సు రద్దు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోర్డుపై నమోదు చేసిన వివరాల ప్రకారం కాకుండా చాలా మంది కమిషన్ ఏజెంట్లు ఒక బస్తాపై రూ.12.81పైసలు కాకుండా మరో రూ.10 అదనంగా చేర్చి వసూలు చేస్తున్నట్లు రైతులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా కమిషన్ ఏజెంట్ల అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రైతు నుంచి ఎంత చార్జి వసూలు చేయాలో ఏర్పాటు చేసిన బోర్డు

అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు



కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు ఎంతో నమ్మకంతో వస్తున్నారు. వారి నుంచి ఎంత చార్జి వసూలు చేయాలో ప్రధాన కూడళ్ల వద్ద బోర్డులను కూడా ఏర్పాటు చేశాం. అంతకంటే ఎక్కువ చార్జి వసూలు చేసే కమిషన్ ఏజెంట్ల లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

- గోవిందు, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

కేంద్ర సంగీత నాటక అకాడమీ ద్వారా శిక్షణ

కర్నూలు(కల్చరల్) జనవరి13: తెలుగు రాష్ట్రాలో మరుగున పడిపోతున్న వివిధ కళలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు కేంద్ర సంగీత నాటక అకాడమీ ద్వారా శిక్షణలు ఏర్పాటు చేశామని అకాడమీ సభ్యులు డాక్టర్ భారతి అన్నారు. అందులో భాగంగా శనివారం కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రానికి మంజూరు చేసిన పద్య నాటక శిక్షణల ఏర్పాట్లను పరిశీలించడానికి ఆమె టీజీవీ కళాక్షేత్రం విచ్చేశారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యతో శిక్షణలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగు భాషకు సొంతమైన పద్య నాటకాలు, తోలుబొమ్మలాటలు, హరికథలు, ద్రౌపది తిరునాళ్ల వంటి కళారూపాలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఏడాది పాటూ శిక్షణలు ఇచ్చి వాటిని ఉనికిలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తోందని అన్నారు. ఎంపిక చేసిన నాలుగు కేంద్రాల్లో పద్య నాటకాల శిక్షణలకు కళాక్షేత్రం ఎంపిక చేశామని తెలిపారు. కర్నూలుతోపాటూ రాజమండ్రి, కాకినాడ, కుప్పంలలో వివిధ కళా రూపాల శిక్షణకు యువతను ఎంపిక చేసి, వారికి ఏడాది పాటూ నెలకు రూ.2 వేలు అందజేస్తున్నామని తెలిపారు. ఈనెల 20న టీజీవీ కళాక్షేత్రంలో శిక్షణలను కలెక్టర్ జి.సృజన ప్రారంభిస్తారని వివరించారు. కార్యక్రమంలో సంగీత గురువు వెంకటేశ్వర్లు, సహాయకులు పాండురంగయ్య, రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

జన ఔషధ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



జన ఔషధ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజయ మనోహరి

సి.బెళగల్, జనవరి 13: జన ఔషధ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు విజయమనోహరి కోరారు. శనివారం మండల కేంద్రంలోని సొసైటీ కాంప్లెక్స్‌లో సింగిల్ విండో ప్రెసిడెంట్ గోపాల్‌రెడ్డి అధ్వర్యంలో జన ఔషధ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలకు 14 జన ఔషధ కేంద్రాలు మంజూరయ్యాయని అన్నారు. కార్యక్రమంలో డీసీఓలు రామంజినేయులు, సీఈఓ రామంజినేయులు, డీజీ ఎంలు విజయ్‌కుమార్, సునీల్‌కుమార్, సెక్రెటరీలు రవికుమార్‌రెడ్డి, ఖాజా, శేఖర్, గూడూరు సింగిల్‌విండో ప్రెసిడెంట్ యల్లారెడ్డి, డెరెక్టర్లు నగేష్, మద్దిలేటి, రైతులు పాల్గొన్నారు.

మురళీకృష్ణకు వర్గీయుల నిరసన

కోడుమూరు(రూరల్), జనవరి 13: వచ్చే ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణను ప్రకటించాలని ఆయన వర్గీయులు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సద్దాం హుసేన్, హనుమంతు, మోషన్న మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణకు 2019లో ఎన్నికల్లో అన్యాయం చేశారని, ఇపుడూ పునరావృతం అయితే సహించబోమన్నారు. అధిష్టానం వైసీపీ టికెట్ ప్రకటించిన డాక్టర్ సతీష్‌కు నియోజకవర్గంపై అవగాహన లేదన్నారు. కార్యక్రమంలో లక్ష్మీరెడ్డి, మారెప్ప, శ్రీరాములు, వీరేంద్ర, రంగస్వామి పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి కవి సమ్మేళనం



సంక్రాంతి కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, రచయితలు

కర్నూలు(కల్చరల్), జనవరి 13: నగరంలోని తెలుగు సారస్వత వైభవం సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో శనివారం మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహించిన సంక్రాంతి కవి సమ్మేళనం ఆసాంతం అలరింపజేసింది. ఈకార్యక్రమం సంస్థ అధ్యక్షుడు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కవులు డాక్టర్ హనుమంతప్ప, డాక్టర్ వి. పోతన్న, డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్‌లను ఘనంగా సత్కరించారు. కవులు ఇనాయతుల్లా, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, ఎలమర్తి రమణయ్య, స్వరూప్‌సిన్హా, కల్యాణదుర్గం స్వర్ణలత, మాసూంబీ, డాక్టర్ కె. చంద్రమౌళిని, సురేష్, బెల్దోనా కృష్ణమూర్తి, హైమావతి, సయ్యద్ జహీర్, మునుస్వామి, రేవుల శ్రీనివాసులు, చిన్నస్వామి, లక్ష్మీకాంతరెడ్డి, బురుజు రామకృష్ణారెడ్డి కవితలు వినిపించారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి

గూడూరు జనవరి 13: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. శనివారం గూడూరులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యాని ఫెస్టోను వివరిస్తుంటే ప్రజల నుంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగులపై వివక్ష వద్దు

కర్నూలు(అర్బన్), జనవరి 13: రాయలసీమ యూనివర్సిటీలో పని చేస్తున్న ఐదుగురు నాన్‌టీచింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వకుండా అధికారులు కక్ష్య పూరితంగా వ్యవహరిస్తున్నారని టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు అన్నారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న దాదాపు 105 మంది నాన్‌టీచింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ ఇచ్చారని, ఇందులో కొంతమందికి 5ఏళ్లు పూర్తి కాకున్న టైం స్కేల్ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రకాష్, నరేష్, నాయక్, రాము పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

కర్నూలు(అర్బన్), జనవరి 13: నగరానికి చెందిన వైసీపీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, వెంకరాముడు 20 మంది అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. బాబురావు ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు వారికి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీని ఆదర్శంగా తీసుకుని కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

కర్నూలు, జనవరి 13: రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. నీలి శికారి గణేష్, ఖాదర్ బాషా, యేసులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,700 నగదు, కొన్ని మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

ప్రమాదకర చట్టాలను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న దివాకర్

కర్నూలు(న్యూసిటీ), జనవరి 13: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రమాదకర చట్టాలను వ్యతిరేకించాలని, సెక్షన్(1)(2) రద్దుకు పోరాటలకు సిద్ధం కావాలని రవాణ రంగ కార్మికుల స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జే.దివాకర్ పిలుపునిచ్చారు. శనివారం కార్మిక కర్షక భవన్‌లో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా నాయకుడు రిజాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ భారతీయ న్యాయ సహిత 2024 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం వల్ల సెక్షన్ 106-(1)(2) కింద ప్రమాదం చేసిన డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల జరిమానా విధిస్తారన్నారు. ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్, ఉపాధ్యక్షుడు బి.రాధాకృష్ణ, కార్యదర్శి మహమూద్, శ్రీను పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్)/(కలెక్టరేట్), జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్ ఆవరణలోని డీపీఆర్ఓ కార్యాలయం వద్ద జర్నలిస్టులకు గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు నిరంతరం పాటుపడుతున్నారని కొనియాడారు.

వీరశైవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

కర్నూలు, జనవరి 13: వీరశైవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని ఐక్యవేదిక పొలిటికల్ ఫోరమ్ కన్వీనర్ జేపీ మల్లికార్జున కోరారు. శనివారం వీరశైవుల ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లాంటి పదవులను కూడా వీరశైవులు నోచుకోలేకపోతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్థానాలను కూడా కేటాయించకపోయినా చైర్మన్ల స్థానాలైనైనా కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీ మల్లికార్జున, కార్యదర్శి చంద్రశేఖరప్ప, సాధికార సమితి చైర్మన్ శివరాజు, బద్రిస్వామి, కోటేశ్వరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఎన్నికలకు సన్నాహం..!




- ఉమ్మడి జిల్లాలో 3,807 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల నిర్వహణకు 30 వేలకు పైగా ఉద్యోగులు
- వివిధ శాఖల నుంచి వివరాల సేకరణ
- సీఈసీ ఆదేశాలతో ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులు

కర్నూలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారుల నేతృత్వంలో యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఓ వైపున సిబ్బందికి శిక్షణ ఇస్తూనే.. మరో వైపున ఈవీఎం యంత్రాలు, పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేస్తున్నారు. అదే క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణకు సుమారుగా 30 వేల మంది సిబ్బంది అవసరమని అంచనా. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లు, ఓటర్ల జాబితా తయారీ తదితర అంశాలపై ఇటీవల విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) కమిషనర్ వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల నిర్వహణలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులను పక్కన పెట్టి వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో ఎన్నికలు నిర్వహించాలని సీఎం జగన్ ప్రభుత్వం అనుకుంటే.. దానిని సీఈసీ ఆరంభంలోనే అడ్డుకుంది. ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులను నియమించాలని సీఈసీ తీసుకున్న కీలక నిర్ణయంతో ఉపాధ్యాయులు సహా వివిధ శాఖల ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు.

ఉద్యోగుల వివరాలు పంపండి

కర్నూలు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో 2,186 పోలింగ్ కేంద్రాలు (పీఎస్) ఉన్నాయి. నంద్యాల జిల్లా నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, శ్రీశైలం, బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల పరిధిలో 1,621 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 3,807 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీఓ, ఏపీఓతోపాటు మరో నలుగురు సిబ్బంది కలిసి ఎన్నికల విధులు నిర్వహించాలి. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 22,842 మంది, 10 శాతం రిజర్వుడు సిబ్బంది 2,285 మంది కలిపి 25,127 మంది ఉద్యోగులు అవసరమని అంచనా. వీరితో పాటు రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లు, మైక్రో అబ్జర్వర్లు (సూక్ష్మ పరిశీలకులు), ఓట్ల లెక్కింపు సిబ్బంది, ఎన్నికల సెల్ సిబ్బంది ఇలా వివిధ విభాగాల్లో పని చేసేందుకు మరో 5 వేల మందికి పైగా అసరమని అంచనా. ఈ లెక్కన సుమారుగా 30 వేల మందికిపైగా ఉద్యోగులు కావాలి. ఈ అవసరాల దృష్ట్యా ఉద్యోగుల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉందని ఓ అధికారి పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖల్లో పని చేసే ఉద్యోగుల వివరాలు పంపాలంటూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు ఆయా శాఖ హెచ్ఓడీలకు ఆదేశాలు జారీ చేశారు.



34 వివరాలు సేకరణ


ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులకు చెందిన 34 వివరాలు సేకరించారు. ఉద్యోగి పేరు, హోదా, జీతం, సొంత జిల్లా, ఉద్యోగం చేస్తున్న జిల్లాలో ఎన్నేళ్లుగా విధులు నిర్వరిస్తున్నారు, ప్రస్తుతం పని చేసే నియోజకవర్గంలో ఎన్నేళ్లుగా ఉన్నారు, గత ఎన్నికల్లో విధులు నిర్వర్తించారా..? ఇలా 34 వివరాలు సేకరించారు. ఇప్పటికే ఆయా శాఖల హెచ్ఓడీలు ఎన్నికల సంఘం అడిగిన ఫార్మెట్‌లో వివరాలను కలెక్టర్లకు అందజేశారు. తాజాగా ఉపాధ్యాయులను కూడా ఎన్నికల విధులకు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈఓ) ఉపాధ్యాయుల వివరాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. ఒకటి రెండు రోజుల్లో కేంద్ర ఎన్నికల సంఘం అడిగిన ఫార్మెట్‌లో ఉపాధ్యాయుల వివరాలు డీఈఓలు కలెక్టర్లకు సమర్పించనున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 15 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

వైసీపీకి మింగుడు పడని సీఈసీ నిర్ణయం

రాబోయే ఎన్నికల్లో ఉపాధ్యాయులను నియమించాలని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తీసుకున్న నిర్ణయం సీఎం జగన్, వైసీపీ నాయకులకు మింగుడు పడడం లేదు. గత ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్ రద్దు చేస్తా అని వైఎస్ జగన్ ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఈ మాట చెప్పి ఐదేళ్లు కావస్తున్నా సీపీఎస్ ఊసే లేదు. పైగా సీపీఎస్ రద్దు సహా వివిధ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు జేఏసీ ఆధ్వార్యంలో వివిధ రూపాల్లో ఆందోళన చేశారు. జగన్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. చలో విజయవాడకు పిలుపు ఇస్తే.. ఎక్కడికక్కడే ఉపాధ్యాయులను అరెస్టులు చేసింది. అక్రమ కేసులు కూడా పెట్టింది. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వం మీద అసమ్మతితో ఉన్నారు. అంతేకాక .. కరోనా సమయంలో గురువులను 'మద్యం దుకాణాలు' వద్ద పని చేయించారు. సర్కారు కక్షగట్టి వివిధ రూపాల్లో ఒత్తిళ్లకు గురి చేస్తున్నదని ఉపాధ్యాయులు ఆగ్రహంతో ఉన్నారు. అందుకని ఎన్నికల విధులకు వారిని దూరం పెట్టి ఏ మాత్రం అనుభవం లేని సచివాలయ ఉద్యోగులతో ఎన్నికలు నిర్వహించి లబ్ధి పొందాలని సీఎం జగన్ ప్రభుత్వం ఎత్తులు వేసింది. అయితే కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం జగన్ సహా వైసీపీ నాయకులకు ఏ మాత్రం మింగుడు పడడం లేదు.



నేడు బాల సాయిబాబా జయంతి వేడుకలు



కర్నూలు(కల్చరల్), జనవరి 13: భగవాన్ బాలసాయిబాబా జయంతి వేడుకలు ఆదివారం పాత నగరంలోని శ్రీనిలయంలో నిర్వహిస్తున్నట్లు బాల సాయి బాబా సెంట్రల్ ట్రస్టు ట్రస్టీ టి. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనిలయంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి బాల సాయిబాబా విగ్రహానికి అభిషేకం, శ్రీచక్రార్చన, భజనలు ఉంటాయని తెలిపారు. దీనజన సేవా కార్యక్రమాల్లో భాగంగా వివిధ ఆసుపత్రుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని అన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు శృంగేరి శారదా పీఠం ఆస్థాన పౌరాణికులు డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్‌చే ఆధ్యాత్మిక ప్రవచన బోధనలు ఉంటాయని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కోసిగి, జనవరి 13: మండల పరిధిలోని ముగలదొడ్డి గ్రామానికి చెందిన కురువ ముత్తన్న (30) అనుమానాస్పద మృతి చెందాడు. ముత్తన్నకు పదేళ్ల క్రితం లక్ష్మితో వివాహమైంది. వీరికి పిల్లలు కలగలేదు. భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పది రోజుల క్రితం లక్ష్మి కోసిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణలో భాగంగా ఇద్దరు కానిస్టేబుళ్లు శుక్రవారం మూగలదొడ్డి గ్రామానికి వెళ్లి బైక్‌పై ముత్తన్నను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. భార్యాభర్తలను విచారించి రాత్రి 9 గంటలకు ఇంటికి పంపారు. శనివారం ఉదయం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మోకాళ్ల ఎత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. మృతుని పాదాలకు గాయాలు, వీపు వెనుక కొట్టిన దెబ్బలు ఉండటంతో ముత్తన్న అక్కలు భీమమ్మ, శివలింగమ్మ, జలాలి.. విచారణ పేరుతో కొట్టారని, ఆ బాధతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించకుండా పోలీసులతో వారు గొడవకు దిగారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చి మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా ముత్తన్న మీద అతని భార్య ఫిర్యాదు చేయడంతో విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చామని, అతడ్ని కొట్టలేదని తెలిపారు.

30 సీజనల్ హాస్టళ్లకు అనుమతి

కర్నూలు (కలెక్టరేట్), జనవరి 13 : జిల్లాలో 2023 -24 సంవత్సరానికి 30 సీజనల్ హాస్టళ్లకు అధికారులు అనుమతి ఇచ్చారు. జిల్లాలో కరువు నెలకొన్న నేపథ్యంలో బతువుదెరువు కోసం హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, చెన్నై తదితర ప్రాంతాలకు తల్లిదండ్రులతోపాటు పాఠశాలలో చదివే విద్యార్థులు వలస వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వం సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇందులోభాగంగా కోసిగి మండలంలో 8, తుగ్గలి, క్రిష్ణగిరి మండలాల్లో 5, పత్తికొండ మండలంలో 4, కౌతాళం మండలంలో 3, హొళగుంద మండలంలో 2, నందవరం కోడుమూరు హాలహర్వి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మంజూరయ్యాయి. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రామంలోని పొదుపు సంఘాలు, ఎన్జీవోలకు సీజనల్ హాస్టళ్లు కేటాయించనున్నారు. ఒక సీజనల్ హాస్టల్‌కు 50 మంది విద్యార్థులకు కేటాయిస్తారు. విద్యార్థులకు టిఫిన్, రాత్రి భోజనం, స్నాక్స్ ఇవ్వనున్నారు. నెలకు ప్రతి విద్యార్థికి రూ.1000, కాస్మొటిక్ ఖర్చులకు రూ.66, కేర్ టేకర్‌కు రూ.10,000 వలంటరీకి రూ.10,000, కుక్‌కు రూ.5,000, హెల్పర్‌కు రూ.5,000 ఇవ్వనున్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- బస్సు డ్రైవర్ దుర్మరణం
- 13 మందికి స్వల్ప గాయాలు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కర్నూలు, జనవరి 13: డోన్ జాతీయ రహదారిలో ఉలిందకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని కొంగన పాడు ఫ్లైఓవర్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిం ది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ ఆంజనేయులు దుర్మరణం చెందా డు. బస్సులో ఉన్న 13 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు వెంటనే వీరిని ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం వెళ్తోంది. శుక్రవారం రాత్రి కళ్యాణదుర్గం డిపో నుంచి బయలు దేరింది. అర్ధరాత్రి సమయంలో ఉలిందకొండ సమీపానికి వచ్చింది. అదే సమ యంలో జాతీయ రహదారిపై టైరు పంక్చరై ఓ లారీ నిలబడిపోయింది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ వేగంగా వచ్చి ఆగివున్న లారీని ఢీకొట్టింది. దీంతో బస్సు నుజ్జును జ్జయింది. డ్రైవర్ సీటులో ఉన్న ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 13 మందికి స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ఆ లారీ యాడికి మండలం రాయలచెరువు నుంచి హైదరాబాదుకు పెయింటింగ్ పౌడర్‌ను తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఎస్ఐ నల్లప్ప సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సులో ఉన్న మరో డ్రైవర్ శివన్న ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆంజనేయులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

టీడీపీతోనే బీసీల సాధికారత

- 30కి పైగా పథకాలను రద్దు చేసిన వైసీపీ
- జయహో బీసీలో గౌరు చరిత



బుక్‌లెట్‌ను విడుతల చేస్తున్న గౌరు దంపతులు, మల్లెల రాజశేఖర్

కల్లూరు, జనవరి 13: తెలుగుదేశం పార్టీతోనే బీసీ కులాల సాధికారత, బీసీలకు రాజ్యాధికారం సాకరమైందని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత స్పష్టం చేశారు. శనివారం ఉలిందకొండలో మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, ఈవీ రమణ ఆధ్వర్యంలో చేపట్టిన జయహో బీసీ కార్యక్రమానికి నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి గౌరు చరిత పాల్గొన్నారు. ముందుగా మహాత్మా జ్యోతిరావుఫూలే, డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ చేపట్టి సంత మార్కెట్ వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రక్షణ లేదని, 74 మంది బీసీ నేతలను పొట్టన పెట్టుకుందని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు 34శాతం నుంచి 24శాతానికి తగ్గించారని, బీసీలను రాజ్యాంగ పదవులకు దూరం చేసిన జగన్‌కు గుణపాఠం చెప్పాలని కోరారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక దాదాపు రూ.75,760 కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని తెలిపారు. ఆదరణలాంటి 30కి పైగా బీసీ సంక్షేమ పథకాలు రద్దు చేసిన దుర్మార్గపు ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. వక్ఫ్, ప్రైవేట్ భూములను కబ్జా చేసిన నాయకులకు ఓటుతో సమాధానం చెప్పాలని సూచించారు. బీసీలకు కార్పొరేషన్లు, సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుదన్నారు. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ బీసీలకు వెన్నుదన్నుగా ఉన్న ప్రభుత్వం టీడీపీ మాత్రమే అన్నారు. బీసీల ద్రోహి జగన్‌రెడ్డిని గద్దెదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సంఘాల నాయకులు మల్లికార్జున, బి.రామకృష్ణ, జిల్లెల శ్రీరాములు, సి.రాంబాబు, బెస్త వెంకటేష్, అరుణ, తిరుపాల్‌బాబు, నాగేశ్వరరావు యాదవ్, శివరాజు, పాణ్యం ఐటీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ, కె.మహేష్‌గౌడ్, జె.గంగాధర్‌గౌడ్, ఎన్వీ రామకృష్ణ, మాదన్న, మాదేష్, ధనుంజయ,రంగస్వామిరెడ్డి, హీరునాయక్, సహరాబి, టీడీపీ బీసీ సంఘాల నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

న్యాయం గెలిచింది: కేఈ శ్యాబాబు



పత్తికొండ, జనవరి 13 : తనపై పెట్టిన నిరాధార కేసులో న్యాయం గెలిచిందని, తనపై పెట్టిన కేసును కోర్టు కొట్టివేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు తెలిపారు. శనివారం ఆయన ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 2017లో వైసీపీ నాయకుడు నారాయణరెడ్డి హత్యతో తనకు ప్రమేయం లేకపోయినా కేసులో ఆయన కుటుంబసభ్యులు తన పేరును చేర్చారన్నారు. జిల్లా కోర్టు విచారించి తనకు ఎలాంటి సంబంధం లేదని శనివారం కొట్టి వేసిందన్నారు.

పొలం ఆన్‌లైన్‌కు లంచం డిమాండ్

- రూ.3000 ఇస్తూ వీడియో తీయించిన రైతు
- సోషల్ మీడియాలో వైరల్



మధ్యవర్తి దగ్గరి నుండి డబ్బులు తీసుకుంటున్న ఆర్ఐ దినేజ్ కుమార్

ఆదోని, జనవరి 13 : ఆన్‌లైన్‌లో పొలం నమోదు చేసేందుకు ఓ రెవెన్యూ అధికారి లంచం డిమాండ్ చేశాడు. దీంతో సదరు రైతు లంచం ఇస్తూ రహస్యంగా తీసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. గజ్జెహళ్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ఆర్ఐ దినోజ్ కుమార్ కోరాడు. నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిరిగినా సదరు అధికారి పట్టించుకోలేదు. అదే గ్రామానికి చెందిన మధ్యవర్తి ఇమామ్ హుస్సేన్‌ను సంప్రదించాలని సదరు అధికారి సూచించాడు. రైతు మధ్యవర్తిని కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు మూడు వేల రూపాయలు లంచం ఇచ్చాడు. ఈ తతంగాన్ని మొత్తం రహస్యంగా వీడియో తీయించాడు. ఈ అధికారి పై గతంలో ఎన్నో ఆరోపణలు వచ్చినా అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పుడైనా చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి మరి. ఈ విషయంపై ఆర్ఐ దినోజ్ కుమార్‌ను వివరణ కోరగా తనపై దుష్ప్రచారం చేసేందుకు ఆ వీడియో వైరల్ చేస్తున్నారని, ఆ సంఘటన ఆరు నెలల క్రితం జరిగినదిగా తెలిపారు.

నిందితుల అరెస్టు

ఎమ్మిగనూరు, జనవరి 13: ఓ వ్యక్తి మృతి కేసులో పోలీసులు శనివారం నిందితులను అరెస్టు చేశారు. పట్టణానికి చెందిన మహబూబ్ బాషాపై కొత్త ఏడాది వేడుకల సందర్భంగా కొంత మంది యువకులు దాడి చేశారు. మహబూబ్ బాషా గాయపడడంతో కర్నూలులో చికిత్స పొందుతూ ఈ నెల 3న మృతి చెందాడు. ఈ కేసులో నిందితులుగా ఉన్న బోయ రాజు, బోయ వెంకటేష్, అలియాస్ వెంకి, బోయ చరణ్ రాజు, సూగూరు హోమ్ దీప్, ఈడిగ గోపాల్ గౌడ్, కొమ్ము రాజశేఖర్, గొల్ల బాలాజీ, వడ్డె పవన్ కల్యాణ్, కారుమంచి ఉరుకుందు, ఉప్పర యశ్వంత్ కుమార్, ఉప్పర ముగతి భీమాలతోపాటు మరో ఇద్దరు మైనర్లను పట్టణంలోని ఉప్పర వీధిలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

పడిపోయిన మొక్కజొన్న ధర

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 13: కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రయోజనాన్ని చేకూర్చేందుకు ప్రతి పంట ఉత్పత్తికి మద్దతు ధరను ప్రకటిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ఈ ధర లభించనప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆధీనంలోని సంస్థలను రంగంలోకి దించి మద్దతు ధరకు రైతుల నుంచి పంట ఉత్పత్తులను సేకరించాలి. అయితే.. ఈ మద్దతు ధర ప్రకటించడం వరకే తమ పని అంటూ రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. శనివారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం మొక్కజొన్నలకు గరిష్ట ధర రూ.1,758లు మాత్రమే దక్కింది. ప్రభుత్వం క్వింటం మొక్కజొన్నలకు రూ.2,090గా నిర్ణయించింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే దాదాపు రూ.300 తగ్గిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మద్దతు ధర దక్కనప్పుడు మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు వెంటనే రంగంలోకి దిగి కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా మొక్కజొన్నలను మద్దతు ధరకు కొనాలి. నెల రోజులుగా మొక్కజొన్న రైతులు నష్టాలకు గురవుతున్నా కర్నూలు, నంద్యాల జిల్లాల మార్క్‌ఫెడ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. మరింతగా ఈ ధర తగ్గకముందే వెంటనే మద్దతు ధరకు తమ వద్ద ఉన్న మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని మొర పెట్టుకుంటున్నారు.

కేంద్ర మంత్రికి పీఠాధిపతి ఆశీస్సులు



కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషికి ఆశీస్సులు ఇస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 13: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద జోషికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులు అందజేశారు. శుక్రవారం రాత్రి మంత్రాలయంలో బస చేసి శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చేసే సంస్థాన పూజల్లో పాల్గొన్నారు. కేంద్ర మంత్రికి పీఠాధిపతి మెమెంటో, శేషవస్త్రం, పలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు ఉన్నారు.

నకిలీ మోటార్ ఇన్‌స్పెక్టర్ల అరెస్టు

కారు, రూ.2,200 నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

ఆళ్లగడ్డ, జనవరి 13: ఆళ్లగడ్డ పట్టణంలో మోటార్ సైకిల్ ఇన్‌స్పెక్టర్లమని చెప్పుకొని వాహనం తనిఖీ చేస్తుండగా పట్టణ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకటరెడ్డి తమ సిబ్బందితో కలిసి ముగ్గురిని శనివారం అరెస్టు చేశారు. కోవెలకుంట్ల రోడ్డులోని కాశీనాయన ఆశ్రమం వద్ద ఆళ్లగడ్డకు చెందిన విల్సనకుమార్, దూదేకుల హుసేనయ్య, నగబాలి చిన్నవెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటరామయ్య విలేఖరుల సమావేశంలో చెప్పారు. నిందితుల వద్ద నుంచి టాటా జెస్ట్ కారు, రూ.2,200 నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. వ్యసనాలకు అలవాటుపడి, డబ్బు సంపాదించడానికి ప్రజలను మోసం చేస్తున్న వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

మల్లన్న సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు

శ్రీశైలం, జనవరి 13: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు దంపతులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావుకు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మల్లికార్జునస్వామి, అమ్మవార్ల భృంగివాహనసేవలో పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం రాత్రి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మినారాయణ్ అలిశెట్టి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న నాయమూర్తికి అధికారులు, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు జడ్జి స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవిని దర్శించుకున్నారు.

అయోధ్య రామమందిరం ప్రారంభ వేడుకకు ఆహ్వానం



శివస్వామికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, జనవరి 13: అయోధ్య రామ మందిరం ప్రారంభ వేడుకకు శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామిజి, శ్రీశైలం శ్రీదత్తసాయి మౌనస్వామి ఆశ్రమం ఆధ్యాత్మిక ఆశ్రమం గురువు శివస్వామికి ఆహ్వానం అందింది. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నిర్వాహకులు పంపిన ఆహ్వానపత్రం, అయోధ్య చిత్రపటం, అక్షింతలు శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు చేతుల మీదుగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శివ స్వామికి అందజేశారు. స్థానిక రామసేవకులు గిరిధర్, చెన్న కేశవ, చదువుల శ్రీను, హనుమాన్ నాయక్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

నీలకంఠేశ్వర స్వామి రథానికి పూజలు

ఎమ్మిగనూరు, జనవరి 13: ఎమ్మిగనూరు ప్రజల ఆరాధ్య దైవం నీలకంఠేశ్వర స్వామి రథానికి ఆలయ ధర్మకర్తలు పూజలు చేశారు. ఈ నెల 27న ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి (జాతర)మహా రథోత్సవం జరగనుంది. ఉత్సవాల్లో భాగంగా శనివారం తేరుబజారులో ఉన్న రథశాలలో ఉన్న రథానికి పూజలు చేసి బయటకు తీశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎద్దులింటి నీల మురళీధర్, మాచాని శివశంకర్, మాచాని జగదీష్, శ్రీకాంత్, హనుమేష్, హరిశేఖర్, శివకేశవ, వెంకటేశప్ప రాజు, మహేష్, ప్రసాద్, పూజారి బసవన్న పాల్గొన్నారు.



రథానికి పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్తలు

16న రామలింగేశ్వర స్వామి రథోత్సవం

మంత్రాలయం, జనవరి 13: మండలంలోని రాంపురం గ్రామం తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వర స్వామి రథోత్సవాన్ని ఈ నెల 16న కన్నుల పండువగా నిర్వహించనున్నారు. రాంపురంరెడ్డి సోదరుల ఇంటి నుంచి పల్లకీలో ఉత్సవమూర్తిని ఆలయం వరకు ఊరేగించి ప్రత్యేపూజలు చేసి మహారథంపై అధిష్టించి రథోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్తలు పాటిల్ లలితమ్మ, రాంపురం రెడ్డిసోదరులు టీటీడీ పాలకమండలి సభ్యులు సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మంత్రాలయం సొసైటీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, భీమా యూత్ నాయకులు ధరణీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఆదోని గుంతకల్ ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, వెంకటరామిరెడ్డితో పాటు కర్ణాటకకు చెందిన పలువురు పీఠాధిపతులు హాజరు కానున్నారు. భక్తులకు రాంపురం రెడ్డిసోదరులు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, మంత్రాలయం సీఐ ఎరిషావలి, మంత్రాలయం, మాధవరం ఎస్‌ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్‌బాబు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.



రామలింగేశ్వర స్వామి మూలవిరాట్

సెక్రటరీలకు పదోన్నతులు

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 13: మార్కెట్ కమిటీల్లో పని చేస్తున్న సెక్రటరీలకు పదోన్నతులు కల్పించే ప్రక్రియను మార్కెటింగ్ శాఖ కమిషనర్ చేపట్టారు. శనివారం కర్నూలు జిల్లాలోని కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు మార్కెట్ కమిటీలకు మూడవ గ్రేడ్ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పించిన అధికారులకు పోస్టింగులను కమిషనర్ జారీ చేశారు. సహాయ సెక్రటరీలుగా పని చేస్తున్న సుందర్‌రాజును కోడుమూరు మార్కెట్ కమిటి సెక్రటరీగా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. అదేవిధంగా ఆలూరు మార్కెట్ కమిటీకి సుకన్య, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీకి పద్మావతిని నియమించారు. వీరు బుధవారం బాధ్యతలు తీసుకోవాలని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు కర్నూలు మార్కె టింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. నంద్యాల జిల్లాలో ఎవరికీ పదోన్నతులు లభించలేదు. మరికొద్ది రోజుల్లో సూపర్‌వైజర్లుగా పని చేస్తున్న కొంత మందికి పదోన్నతులు లభించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులో పని చేస్తున్న కేశవరెడ్డి, శివన్న, నాగేష్‌లకు అదనపు సెక్రటరీలుగా పదోన్నతి లభించే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

ఆదోని టౌన్, జనవరి 13: పట్టణంలోని పాత రైల్వే ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే కొత్త ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య, ప్రభుత్వ ఆసుపత్రుల సలహా సంఘం సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ కోరారు. శనివారం వారు మాట్లాడుతూ కర్ణాటక ప్రాంతంలోని హగిరి నుంచి ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, నాగులదిన్నె ప్రాంతాల మీదుగా హైదరాబాదు వరకు జరుగుతున్న 167వ జాతీయ రహదారి పనుల్లో భాగంగా ఈ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉందని తెలిపారు.

అందరి సహకారంతోనే 15వ ర్యాంకు

ఆదోని టౌన్, జనవరి 13: స్వచ్ఛ సర్వేక్షన్ 2023 సంవత్సరానికి ఆదోని మున్సిపాల్టీకి రాష్ట్రంలోనే 15వ ర్యాంకు లభించడం సంతోషంగా ఉందని కమిషనర్ రఘునాథ్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని మొత్తం 124 పురపాలక సంఘాలతో ఆదోని మున్సిపాల్టీ 15వ ర్యాంక్ లభించడం, జాతీయ స్థాయిలో 247వ ర్యాంక్ సాధించడం అందరి సహకారంతోనే సాధ్యమైంది అన్నారు.

శాంతి భద్రతలను పరిరక్షించండి

ఆలూరు, జనవరి 13: శాంతిభద్రతలను పరిరక్షించాలని మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. ఆస్పరి సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన హనుమంతప్ప మర్యాదపూర్వకంగా శనివారం మంత్రిని కలిశారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు.

సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు

దేవనకొండ ,జనవరి 13: దేవనకొండ అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐగా కుంచాల శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలను అరికట్టి శాంతి భద్రతలను నెలకొల్పుతానన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చుస్తామని అన్నారు.

బోరు ఏర్పాటు

మద్దికెర, జనవరి 13: మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారని, వారి సౌకర్యార్థం నీటి సమస్య తీర్చేందుకే బోరు వేస్తున్నామని ఎంపీడీవో నరసింహమూర్తి, ఎంపీపీ అనిత యాదవ్, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం మండల నిధులతో వేస్తున్న బోరుకు పూజలు చేశారు. నీరు పుష్కలంగా పడిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సలహాదారుడు బండారు అంజనేయులు, మైనార్టీ నాయకులు ఆకుల ఖాజావలి, కృష్ణయాదవ్, కవిరెడ్డి కృష్ణ, గోపాల్, ఎంపీటీసీలు అంజనేయులు, రామకృష్ణలు ఉన్నారు.

కప్పట్రాళ్లలో డెంగీ కేసు

దేవనకొండ, జనవరి 13: మండలంలోని కప్పట్రాళ్లలో డెంగీ కేసు నిర్ధారించిన్నట్లు సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు డెంగీ బారిన పడ్డాడు. గ్రామాలలో పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకొని వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూపర్‌వైజర్ రంగస్వామి అన్నారు.

బస్సు ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

ఆదోని, జనవరి 13: ఆదోని మండలం కుప్పగల్లు గ్రామంలో బాలుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుప్పగల్లు గ్రామానికి చెందిన జగదీష్, లక్ష్మీ దంపతుల కుమారుడు నందకిషోర్(3) ఇంటి ముందు ఆటలాడుకుంటూ రోడ్డు దాటుతుండగా అదే సమయంలో ఆదోని నుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బాలుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నందకిషోర్‌ను హుటాహుటిన ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు కర్నూలుకు తీసుకెళ్లాలని సూచించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆలూరు, జనవరి 13: మండలంలోని తంగరడోణ గ్రామంలో కూరగాయల మార్కెట్ సమీపంలో ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు స్థానిక పోలీస్ స్టేషన్ సీఐ హనుమంతప్ప, ఎస్సై వరప్రసాద్‌లు తెలిపారు. శనివారం పేకాట ఆడుతున్న విషయం పోలీసులకు సమాచారం రావడంతో వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.21,690, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

కూలీల వలస బాట

కోసిగి, జనవరి 13: ఉన్న ఊరులో పనులు చేసుకుందామంటే ఉపాధి పనుల్లేవు. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో పంటలు లేవు. చేసేదేమీ లేక పిల్లాపాపలతో కలిసి మూటముల్లు సర్దుకుని ఇతర రాష్ట్రాలకు వలసబాట పట్టారు. కోసిగిలోని 2, 3, 5, 6, 9 వార్డులతో పాటు దుద్ది, అర్లబండ, చిర్తనకల్లు, కోల్‌మానుపేట గ్రామాల నుంచి సైతం 500 కుటుంబాలకు పైగా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వలసబాట పట్టాయి. ఉపాధి చూపించాల్సిన అధికారులు ఆఫీసులకే పరిమితం కావడంతో మూటముల్లు సర్దుకుని సొంత గ్రామాన్ని బంధువులను వదిలి పొట్టకూటి కోసం వలసబాట పట్టామని ఆవేదన వ్యక్తం చేశారు. కోసిగితో పాటు అన్ని గ్రామాల్లో ఇంటికి తాళాలు వేయడంతో కాలనీలన్నీ నిర్మానుష్యంగా మారాయి.



హొళగుందలో గుంటూరుకు వలస వెళ్లేందుకు సిద్ధమవుతున్న కూలీలు



పిల్లా పాపలతో కలిసి వాహనంలో వలస వెళ్తున్న కూలీలు

60 కుటుంబాలు వలస

హొళగుంద: హొళగుందలోని బీసీ కాలనీ, అయోధ్య నగర్, దిడ్డి కాలనీకి చెందిన 60 కుటుంబాలు వలసబాట పట్టారు. గ్రామంలో కూలీలకు సరిపడా కూలీలు లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కూలీలు వాపోతున్నారు. గుంటూరులోని పత్తిపాడులో మిరప పంట తెంపేందుకు చిన్నపిల్లలతో సహా వలస వెళ్లారు. ఉపాధి పనులకు వెళ్లినా, సక్రమంగా వేతనాలు అందడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ ఉన్నా కూలీలు వలసలు వెళ్లేందుకు సిద్ధమ య్యారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలని కోరారు.

కేఈ శ్యాంబాబుపై కేసు కొట్టివేత

టీడీపీ నాయకుల సంబరాలు



బాణాసంచా కాలుస్తున్న టీడీపీ నాయకులు

వెల్దుర్తి, జనవరి 13: కేఈ శ్యాంబాబుపై అక్రమ కేసును కోర్టు కొట్టివేయడంతో పట్టణంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బలరాంగౌడ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి టీడీపీ నాయకులు బాణాసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. బలరాంగౌడ్ మాట్లాడుతూ 2017 నారాయణరెడ్డి హత్య కేసులో తెలుగుదేశం పార్టీ పత్తికొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ కేఈ శ్యాంబాబుకు ఎటువంటి సంబంధం లేకపోయినా అక్రమంగా పేరు చేర్చారన్నారు. జిల్లా కోర్టు కేఈ శ్యాంబాబుకు ఆ హత్యతో సంబంధం లేదని శనివారం పిటిషన్ కొట్టివేసిందన్నారు. అన్యాయంగా కేసు పెట్టినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. కార్యక్రమంలో ఎర్రబజారు, వీరభద్రుడు, రాఘవేంద్ర గౌడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెదిరిస్తే భయపడేది లేదు

▸ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 13: చర్చలకని పిలిచి అంగన్‌వాడీలను ప్రభుత్వం బెదిరిస్తే భయపడేది లేదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యునియన్ ఐకాస నాయకులు నాగలక్ష్మి, శైలజ, నీరజ, మల్లీశ్వరి, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు రాముడు, తిమ్మగురుడు, ప్రసాద్ అన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సోమప్ప సర్కిల్‌లో జగనన్నకు చెబుదాం పేరుతో కోటి సంతకాల సేకరణను ప్రారంభించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్ నేరుగా అంగన్‌వాడీలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. హామీలు ఇచ్చింది సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ కాదని అన్నారు. సీఎం వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంతవరకు సమ్మెను విరమించేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో నాయకురాలు అరుణ, మహేశ్వరి, గాయత్రి, పుష్పలత, లత, శమంతకమణి పాల్గొన్నారు.



ఆలూరులో..

ఆదోని: మాట తప్పిన సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వరలక్ష్మీ, శారదలు హెచ్చరించారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి 33వ రోజుకు చేరుకుంది. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వం ఎన్ని భయభ్రాంతులకు గురిచేసిన భయపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో గతా, విమల, పద్మ, సోమక్క, రిజ్వానా, మీనాకుమారి, లలిత, ఉమ, లక్ష్మీదేవి, శారద, గీత, ఈరమ్మ పాల్గొన్నారు.

ఆలూరు: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆలూరులో అంగన్‌వాడీల సమ్మె 33వ రోజుకు చేరింది. సమ్మెకు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంక టేశ్వర్లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణ, షాకీర్, గోవర్ధన్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయ కులు బాలరంగమ్మ, భారతి, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

మంత్రాలయం: అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరుకుంది. శనివారం మంత్రాలయంలో జగనన్నకు చెబుదాం రా.. అంటూ అంగన్‌వాడీల కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ, సీపీఐ పాల్గొన్నారు.

వెల్దుర్తి: పట్టణంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలు చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. శనివారం రామళ్ళకోట సెక్టార్ అంగన్‌వాడీలు నాగలక్ష్మి, రామేశ్వరి, శారద, అరుణ, జయమ్మ, రేణుక దీక్షలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సావిత్రి, వరలక్ష్మీ, ఈదమ్మ, సుజాత, సునీత, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.



ఆదోనిలో ప్రభుత్వ నోటీసులను తగలబెడుతున్న అంగన్‌వాడీలు



ఎమ్మిగనూరులో సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీలు

దేవాలయ అభివృద్ధికి సహకరిస్తాం



విరాళం అందజేస్తున్న దాతలు

మద్దికెర, జనవరి 13: మండలంలోని పెరవలి గ్రామంలో రంగనాథస్వామి దేవాలయ అభివృద్ధికి సహకరిస్తామని దాతలు లింగం ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులు అన్నారు. శనివారం రంగనాథస్వామి దేవాలయంలో ఆలయ ఛైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడ్, ఈవో చంద్రశేఖర్‌రెడ్డిలకు గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు రూ.లక్షన్నర నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేతలను ఆదుకోవడంలో సీఎం విఫలం

ఎమ్మిగనూరు, జనవరి 13: చేనేతలను ఆదుకోవడంలో సీఎం జగన్ విఫలమయ్యారని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాధవస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని లెనిన్ భవనంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల కరపత్రాలను స్థానిక నాయకులు పంపన్నగౌడ్, రంగన్నలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే చేనేత కార్మికులను ఆదుకొని వారు ఆత్మహత్యలు చేసుకోకుండా చర్యలు తీసుకుంటానని చెప్పిన సీఎం జగన్ ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇక కేంద్రంలోని నరేంద్రమోదీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ వ్యాపారులతో కుమ్మక్కై వారికే వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. చివరికి జాతీయ చేనేత అడ్వైజరీ బోర్డును రద్దు చేసి చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకుండా మొండి చెయ్యి చూపిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో మంగళగిరిలో చేనేత కార్మిక సంఘం 13వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, చేనేత కార్మికులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్, బడేసా, శివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు



శ్రీమఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, జనవరి 13: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు మంత్రాలయానికి పోటెత్తారు. శని, ఆదివారం, అలాగే వరసగా సంక్రాంతి సెలవు దినాలు కావటంతో దక్షణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

వైభవంగా సుయమీంద్రతీర్థుల ఆరాధన: వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి సుయమీంద్రతీర్థ ఆరాధన మహోత్సవాలు వైభ వంగా నిర్వహించారు. శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో సుయమీంద్రతీర్థుల బృందావనానికి విశేష పంచామృతా భిషేకం నిర్వహించి హారతులు ఇచ్చారు. మూలరాములకు విశేష పుష్పా భిషేకం, తులసి అర్చన, బంగారు నాణేలతో అభిషేకం చేశారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

మద్దికెర, జనవరి 13: రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా సభ కూడా జరగనివ్వకుండా రాక్షసపాలన సాగిస్తున్నారని బీసీవై నియోజకవర్గ నాయకులు జొన్నగిరి వెంకటేష్‌యాదవ్, జిల్లా బీసీవై నాయకులు బురుజుల పక్కీరప్ప అన్నారు. శనివారం మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కుంగనూరు పట్టణంలో అన్ని అనుమతులతో ప్రైవేట్ స్థలంలో ధర్మపోరాట సభను పెట్టుకోవాలని మా నాయకులు బీసీవై అధినేత రాజశేఖర్‌యాదవ్ నిర్ణయిస్తే మంత్రి సభ జరగకుండా అడ్డుతగిలారని ఆరోపించారు. బీసీవై నాయకులపై పోలీసులు దాడులు చేయడమే కాకుండా సీఐ చెప్పుతో దాడి చేయడం సిగ్గుచేటన్నారు. బీసీవై కార్యకర్తలపై చెప్పుతో దాడి చేసిన సంబంధిత సీఐపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీవై నాయకులు ఉన్నారు.

కోడిపందేలు ఆడితే చర్యలు

తుగ్గలి, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు ఆడితే చర్యలు తప్పవని తుగ్గలి, జొన్నగిరి ఎస్‌ఐలు మల్లికార్జున, రామాంజినేయులు హెచ్చరించారు. శనివారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి పోలీస్‌స్టేషన్లలో ఎస్‌ఐలు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రోజు జూదర్లు కోడిపందేలతో పాటు ఏవైన అసాంఘిక కార్యకలాపాలు చేపడితే చర్యలు తప్పవని జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు.

బెస్తలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న కత్తి హనుమంతరావు

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 13: వచ్చే ఎన్నికల్లో బెస్తలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని సంఘం రాష్ట్ర నాయకులు కత్తి హనుమంతు రావు, పగడాల కోదండ డిమాండ్ చేశారు. శనివారం మంగళ ఆంజనే యస్వామి ఆలయంలో బెస్త మత్స్యకార బీసీ కులాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెస్తలకు రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎంపీ సీటు కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఈసమావేశంలో నాయకులు శేషన్న, దస్తగిరి నాయు డు, ఈరన్న, ప్రకాష్, కళ్యాణ్, నాగన్న, రాందాస్, దేవన్న, నరేష్, నగేష్, గూడూరు రాజు, జయసూర్య, మల్లికార్జున, గోవిందు, తిమ్మప్ప పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో రాతి ద్వారాలు

మద్దికెర, జనవరి 13: మండలంలోని పెరవలి గ్రామంలో రంగనాథ స్వామి దేవాలయం రాజగోపురం ముందు గ్రామానికి చెందిన పారా రామన్న కుమారులు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టిన్న) రూ.5లక్షలతో తయారు చేసిన రాతి ద్వారాలను ఆలయ ముందు ఏర్పాటు చేశారు. శనివారం ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి నేతృత్వంలో రూ.5లక్షలతో దాతలు తయారు చేయించిన మూడు రాతి ద్వారాలకు ప్రత్యేక పూజలు, గోమాత పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం ముందర ఏర్పాటు చేశారు. రాతి ద్వారాలపైన శ్రీమన్నారాయణ, వివిధ జంతువుల ఫొటోలు ఎంతో ఆకర్షణీయంగా నిలిచాయి. ఆలయ ఛైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

హొళగుంద, జనవరి 13: స్థానిక సాయిబన్న తాత దర్గా పూజారి హసన్ సాబ్ (24) గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు, భక్తులు శనివారం తెలిపారు. వారు తెలిపిన వివరాలివి.. హసన్ సాబ్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఉండగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన హొళగుందలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించంతో మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి జానమ్మ అనే మహిళతో రెండేళ్ల క్రితం వివాహం అయిందని, పిల్లలు లేరని తెలి పారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

దేవనకొండ, జనవరి 13 : మండలంలోని ఓ గ్రామంలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు వీరశేఖర్, అశోక్, మహబుబ్‌బాషా డిమాండ్ చేశారు. బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి



జీవో ప్రతులను విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

పత్తికొండ టౌన్, జనవరి 13: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చి జీవో భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ భోగి మంటల్లో జీవో ప్రతులను దహనం చేసే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజాసాహెబ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మయ్య, సీపీఐ సీనియర్ నాయకుడు భీమలింగప్పలు రైతులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఆర్ భవన్‌లో భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేసి జీవో ప్రతులను విడుదల చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు ప్రభుత్వంపై దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పెద్ద ఈరన్న, ఉమామహేశ్వరరావు, రామానాయుడు, పాపన్న, పెద్దముని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఆదోని టౌన్, జనవరి 13: మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ రాచోటీ రామయ్య ఆధ్వర్యంలో లక్ష్మమ్మ అవ్వ ఆధ్యాత్మిక కేంద్రంలో సనాతన ధర్మం ఆవశ్యకత అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జూనియర్లకు నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానంలో అభిరామి నాయుడు (పాలిటెక్నిక్ కాలేజ్) రెండో స్థానంలో సాయి అనన్య (అక్షరశ్రీ కాలేజి), మూడో స్థానంలో వైష్ణవి (శ్రీకృష్ణ దేవ రాయ హైస్కూల్) నిలిచారు. సీనియర్స్ విభాగంలో మొదటి స్థానంలో రసూల్ (హిందీ టీచ ర్) రెండో స్థానంలో మాధురి (గృహిణి) మూడో స్థానంలో సూర్యనా రాయణ (టీచర్) నిలిచారు. ఈ పోటీలు అవ్వ బ్యాంక్ సీఈవో గట్టు మురళీకుమార్ పర్యవేక్షణ జరిగాయి. నిర్వాహకుడిగా అంకె శ్రీనివాసులు, న్యాయనిర్ణేతలుగా ఎస్ఎస్ ఈరన్న, చంద్రశేఖర్ వ్యవహరించారు.

నిరుద్యోగులను విస్మరించిన ప్రభుత్వం: ఏఐవైఎఫ్

పెద్దకడుబూరు, జనవరి 13: నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫమైందని, వారిని పూర్తిగా విస్మరించిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి ఆరోపించారు. పెద్దకడుబూరులోని సీపీఐ కార్యాలయంలో అధ్యక్షుడు జాఫర్ పటేల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. ఏఐవైఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల అధ్యక్షుడిగా మహ్మద్ హుసేన్, కార్యదర్శిగా దస్తగిరి, కోశాధికారిగా గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాజు, షేక్షావలి, దాదాభాయ్, సలీం, శివరాజు, వీరేష్, సుందరరాజు, శివరాజు, రామాంజినేయులు పాల్గొన్నారు.